క్లుప్తంగా

నేడు కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11.30 గంటలకు కౌన్సిల్ అత్యవసర సమావేశం జరుగుతుందని కమిషనర్ నయీం అహ్మద్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అధికార, ప్రతిపక్ష సభ్యులు, అధికారులు హాజరు కావాలన్నారు. పట్టణంలో అభివృద్ధి పనులకు సంబంధించి అజెండాలో పొందుపర్చిన 13 అంశాలపై చర్చ జరుగుతుందన్నారు.

నేటి నుంచి రైల్వే గేటు మూసివేత



పీబీ దేవంలో మూతపడనున్న రైల్వే గేటు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ పరిధి పీబీ దేవం గ్రామంలోని రైల్వే గేటును మంగళవారం నుంచి ఫిబ్రవరి రెండు వరకూ మూసివేస్తామని సీనియర్ సెక్షన్ ఇంజినీర్ దాసరి సాయిశంకర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ట్రాక్ మరమ్మతుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ మేరకు తహసీల్దార్, గ్రామ సర్పంచ్, పోలీస్ స్టేషన్, ఆటో, లారీ యూనియన్ ప్రతినిధులకు సమాచారం తెలియజేశామని అన్నారు. ఈ అసౌకర్యాన్ని ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. కాగా గ్రామం అంతా రైల్వే గేటు అవతలి వైపు ఉండటంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉంది. చిన్న వాహనాలు రాకపోకలకు గ్రామ శివారులో రైల్వే కాను ఉంది. గేటు మూసివేతతో రైల్వే కాను మీదుగా రాకపోకలు జరిగే అవకాశం ఉంటుంది.

సమస్యల పరిష్కారానికే 'స్పందన'



పెద్దాపురం స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న ఏఓ సరస్వతి

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ సరస్వతి అన్నారు. సోమవారం జరిగిన స్పందనకు డివిజన్ నుంచి ఐదు అర్జీలు వచ్చాయన్నారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖలకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. పట్టాదారు పాస్‌బుక్‌లో పేర్లు మార్చాలని, భూ రీసర్వే చేయాలని, ఆక్రమణకు గురైన స్థలాలను కాపాడాలని, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని తదితర సమస్యలపై ఫిర్యాదులు అందాయన్నారు. పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ డీటీ భానుకుమార్ పాల్గొన్నారు.

విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం



సామర్లకోటలో స్టడీ మెటీరియల్‌ను ప్రదర్శిస్తున్న లక్ష్మీనారాయణ, హెచ్‌ఎం, విద్యార్థులు

సామర్లకోట: ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని, పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందిస్తుందని రాష్ట్ర వైఎస్సార్ సీపీ కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు ఆయన స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం యు.సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన బేస్‌బాల్ పోటీలు



అండర్-14 బాలుర విభాగంలో రెండో స్థానంలో నిలిచిన ఉమ్మడి తూర్పుగోదావరి జట్టు

నాగమల్లితోట జంక్షన్: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14, 17 ఆధ్వర్యంలో స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్ జిల్లాల బేస్‌బాల్ పోటీలు సోమవారంతో ముగిశాయి. అండర్-17 బాలుర విభాగంలో గుంటూరు, శ్రీకాకుళం, ప్రకాశం, బాలికల విభాగంలో కడప, ప్రకాశం, శ్రీకాకుళం, అండర్-14 బాలుర విభాగంలో విజయనగరం, తూర్పు, కడప, బాలికల విభాగంలో విజయనగరం, చిత్తూరు, కర్నూలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. విజేతలకు కాకినాడ డివిజన్ డీవైఈఓ ఆర్‌జేడీ రాజు బహుమతులు అందజేశారు. పీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు, పరిశీలకులు అన్నపూర్ణ పాల్గొన్నారు.

పథకాలు అందకపోతే చెప్పండి

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- గొల్లప్రోలులో గడప గడపకూ మన ప్రభుత్వం



గొల్లప్రోలులో గడప గడకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: అర్హత ఉండి ఏ కారణం చేతనైనా ప్రభుత్వ పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు నగర పంచాయతీ ప్రజలకు సూచించారు. గొల్లప్రోలులో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలు చేస్తున్న పథకాలు అన్ని అందుతున్నాయా ? అంటు ఎమ్మెల్యే పెండెం దొరబాబు ప్రజలను పలకరించారు. ప్రతి ఇంట్లో వారిని ఆప్యాయంగా పలకరించి ఇంటిలో ఎవరెవరికి ఏయే పథాకాలు అందుతున్నాయి అని ఆరా తీశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కొన్ని కారణాల వల్ల తమకు పథకాలు ఆగిపోయాయని, ఎవరూ పట్టించుకోవడం లేదని కొందరు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఏ కారణంతో వారికి పథకాలు ఆగిపోయాయని ఎమ్మెల్యే అధికారులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుని అర్హత ఉన్నవారికి కచ్చితంగా పథకం అందేలా చూడాలని ఆదేశించారు. పథకాలు రావడం లేదని ఊరుకోకుండా వెంటనే స్థానిక వార్డు సచివాలయ సిబ్బంది దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని లబ్ధిదారులకు సూచించారు. కొన్ని సాంకేతిక సమస్యల వల్ల కొందరికి పథకాలు అందడంలో జాప్యం జరుగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. వాటిని వెంటనే పరిష్కరించి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఒక వేళ వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్ పట్టించుకోకపోతే తన దృష్టికి తీసుకురావాలని లబ్ధిదారులకు సూచించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఎటువంటి పైరవీలకు తావు లేకుండా పని చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ల ఇంచార్జ్ మొగలి సాంబశివరావు, పిఠాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ తెడ్లపు చిన్నారావు, కౌన్సిలర్లు గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, కూరాకుల శేఖర్, మొగలి దొరబాబు, వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు దాసం పూజలు, పార్టీ నేతుల మొగలి బాబ్జి, మొగలి అయ్యారావు, చెక్కపల్లి దివాణం పాల్గొన్నారు.

'పాదగయ'లో మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు



పాదగయ క్షేత్రంతో చలువ పందిర్లు వేస్తున్న సిబ్బంది

పిఠాపురం: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రంలో వచ్చే నెల 16వ తేదీ నుంచి నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు ఆలయ అధికారులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పందిరి రాట వేసి పనులు ప్రారంభించిన సిబ్బంది ఏర్పాట్లను వేగవంతం చేశారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిర్లు, పాదగయ పుష్కరిణిని శుద్ధి చేసే పనులు చేపట్టారు. ఇప్పటికే ఆలయాలకు రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. క్యూలైన్ల ఏర్పాటు, భక్తులకు మంచినీటి, మరుగుదొడ్లు ఏర్పాట్లు చేపట్టారు. మహాశివరాత్రి ఉత్సవాలు కన్నులపండువగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ ఆర్.సౌజన్య తెలిపారు. పాదగయ క్షేత్రానికి వేలాదిగా భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, కుంకుమ పూజలు ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది సుమారు నాలుగు లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతిఒక్కరికీ స్వామివారి దర్శనం లభించేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు తెలిపారు.

పనులకు టెండర్లు ఆహ్వానించండి

కాంట్రాక్టు కమిటీ సమావేశంలో చైర్‌పర్సన్ అరుణ



కాంట్రాక్టు కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అరుణ

సామర్లకోట: స్థానిక కౌన్సిల్ సమావేశంలో ఆమోదం పొందిన పనులు చేపట్టేందుకు టెండర్లు ఆహ్వానించాలని చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ చాంబర్‌లో కాంట్రాక్టు కమిటీ సమావేశం నిర్వహించారు. కౌన్సిల్ ఆమోదం పొంది ఏడాది గడిచిన పనులకు ఇప్పటి వరకూ టెండర్లు పిలవడం లేదని కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, పాగా సురేష్‌కుమార్, రెడ్నం సునీత ఆరోపించారు. దీంతో కౌన్సిల్ ఆమోదం పొందిన పనుల వివరాలను సభ్యులకు తెలియజేయాలని చైర్‌పర్సన్ అరుణ మున్సిపల్ డీఈ హుస్సేన్‌కు సూచించారు. ఇందులో కొన్ని పనులు ప్రారంభం కాకపోవడంతో నిధులు వెనక్కి మళ్లాయని పాగా సురేష్‌కుమార్ అన్నారు. టెండర్లు పిలిచినా కొన్ని పనులకు కాంట్రాక్టర్లు ఎందుకు ముందుకు రావడం లేదో సభ్యులకు వివరించాలన్నారు. కాంట్రాక్టర్లు పూర్తి చేసిన పనులకు సంబంధించి బిల్లులు జాప్యం లేకుండా ప్రభుత్వానికి పంపాలని చైర్‌పర్సన్ అరుణ, వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ సూచించారు. నీలమ్మ చెరువు పనులు వేగంగా జరిగే విధంగా చూడాలని నేతల హరిబాబు, స్వయంభారపు వీరభద్రరావు, నమ్మి వాసులు డిమాండ్ చేశారు. వచ్చే సమావేశం నాటికి పనులపై పూర్తి స్థాయిలో వివరణ ఉండాలని చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు తెలిపారు. రెండో వైస్ చైర్‌పర్సన్ గోకిన సునేత్రదేవి, మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్, కౌన్సిలర్ గుబ్బల సత్యనారాయణ, ఏఈ వి.అరవింద్, కాంట్రాక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయ సాధనకు కృషి



పెద్దాపురం మున్సిపల్ కార్యాలయంలో గాంధీకి నివాళులర్పిస్తున్న వైస్ చైర్మన్



విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేసిన వాసవీ క్లబ్ ప్రతినిధులు

పెద్దాపురం: జాతిపిత మహాత్మా గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయిప్రసాద్ మాట్లాడుతూ అలుపెరగని పోరాటం ద్వారా దేశానికి స్వాతంత్య్రం తీసుకువచ్చిన ఘనత గాంధీ మహాత్ముడిదేనన్నారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, విడదాసరి రాజా, కోఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, జాలా దావీదు, సిద్ధి బాబ్జి తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి వి.శ్రీనివాస్, మండల జేఈ అప్పారావు, సీనియర్ సహాయకులు జగన్నాథం పాల్గొన్నారు. పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో గాంధీ వర్ధంతిని నిర్వహించారు. పాఠశాల చైర్మన్ రావయపు వీరబాబు, డైరెక్టర్ రాయవరపు సత్య, వేణు, శాంతివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ సేవలు మరువలేనివి

పిఠాపురం: దేశానికి స్వాతంత్య్రం తీసుకువచ్చిన మహాత్మా గాంధీ సేవలు మరువలేనివని గొల్లప్రోలు వాసవి క్లబ్ నాయకులు అన్నారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక నల్లం అచ్చియ్యమ్మ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. వాసవి క్లబ్ ప్రతినిధులు గ్రంధి లచ్చన్న, దంగేటి శ్రీరామకృష్ణ, కేదారిశెట్టి చలపతిరావు, ఊర సుబ్బారావు, దంగేటి సూర్యనారాయణ, దంగేటి సుబ్రహ్మణ్యం, కంకటాల వాసు తదితరులు పాల్గొన్నారు.

నేడు వాటర్ ట్యాంకుల ప్రారంభం

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ పథకంలో నిర్మించిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు, ఇంటింటికీ కుళాయి కనెక్షన్లను ఎమ్మెల్యే పెండెం దొరబాబు మంగళవారం ప్రారంభిస్తారని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సంధ్య సోమవారం తెలిపారు. మండలంలోని కొత్త ఇసుకపల్లి, పొన్నాడ, గోర్స గ్రామాల్లో నిర్మించిన వాటర్ ట్యాంకులను ప్రారంభిస్తారన్నారు. అనంతరం గోర్సలో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తారని మండల వ్యవసాయశాఖ అధికారి జోగిరాజు తెలపారు.

శుభకరా.. భీమేశ్వరా..

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామివారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరీ సమేత కుమార రామభీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘమాసం, స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో ఉదయం స్వామివారికి అభిషేకాలు చేశారు. బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, శ్రీపాద రాజశేఖర శర్మ, కొంతేటి జోగారావు, వినయ్, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, భీమన్నలు పూజా కార్యక్రమాలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకటసుబ్బారావు, చందలాడ వెంకట్రావు, చల్లా కుమారి, కర్రి వెంకటలక్ష్మి, నేతల వెంకటలక్ష్మి, నాతిపాముల సూరిబాబు భక్తులకు సేవలందించారు.

నేటి నుంచి వెంకన్న కల్యాణోత్సవాలు

వేట్లపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి ఫిబ్రవరి 5 తేదీ వరకూ కల్యాణ ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ధర్మకర్త పెంద్యాల నాగేశ్వరరావు మాస్టారు తెలిపారు. మంగళవారం స్వామి, అమ్మవార్లను పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలను చేసి మేళతాళాలతో గ్రామోత్సవం చేస్తారు. ఫిబ్రవరి 1న భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గోపూజ, స్వామివారికి 9 రకాల లక్ష పుష్పాలతో పూజ ఉంటుందన్నారు. సాయంత్రం శేషవాహన సేవ, రాత్రి స్వామివారి కల్యాణం జరుగుతుందని చెప్పారు. 3న సదస్యం, 4న లక్ష గోవింద నామ గానామృతం, విష్ణు సహస్రనామ పారాయణ, 5న శ్రీపుష్ప యాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఫిబ్రవరి 1 నుంచి మండల, జిల్లా స్థాయి భజన పోటీలు జరుగుతాయన్నారు. పురుషులు, స్త్రీలకు విడివిడిగా ఒకటి, రెండో తేదీలలో మండల స్థాయి, మూడు నుంచి జిల్లా స్థాయిలో భజన పోటీలు ఉంటాయని వివరించారు.

రైల్వే స్టేషన్‌లో స్వామివారి కౌంటర్ ఏర్పాటు చేయాలి

ఆర్టీఐ యాక్ట్ కమిషనర్ రమణకుమార్



అధికారులకు స్వామివారి ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ రెడ్డెం జనార్దనరావు

పిఠాపురం: దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులకు సమాచారం కోసం స్థానిక రైల్వే స్టేషన్లో శ్రీపాదశ్రీవల్లభస్వామి ఆలయ కౌంటర్ ఏర్పాటు చేయాలని ఆర్టీఐ యాక్ట్ కమిషనర్ బీవీ రమణకుమార్ ఆలయ అధికారులకు సూచించారు. పిఠాపురంలో శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానాన్ని ఆయన సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. వేలాదిగా భక్తులు శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానాన్ని దర్శించుకునేందుకు వస్తున్న నేపథ్యంలో వారికి తగిన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉదయలక్ష్మి, ఏపీ డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వర్మ తదితరులు శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత వారికి ఆలయ ఈఓ ఆర్.సౌజన్య, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ రెడ్డెం జనార్దనరావు తదితరులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.

వచ్చే నెల 3న వైస్ ఎంపీపీ ఎన్నిక

సామర్లకోట: స్థానిక మండల పరిషత్తులో వైస్ ఎంపీపీ-1 ఎన్నిక వచ్చే నెల 3న జరుగుతుందని ఎంపీడీఓ డి.శ్రీలలిత తెలిపారు. సోమవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వైస్ ఎంపీపీ మలిరెడ్డి సూర్యావతి మృతి చెందడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. దాంతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి నోటిఫికేషన్ విడుదల చేయడంతో మండల ఉపాధ్యక్ష-1 ఎన్నికల జరుగుతుందని చెప్పారు. దీనికి పెద్దాపురం డివిజన్ అభివృద్ధి అధికారి కేఎస్‌వీ ప్రసాద్ ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారన్నారు. ఉపాధ్యక్ష ఎన్నిక కోసం నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులంతా హాజరు కావాలన్నారు.

బిందు సేద్యంపై దృష్టి సారించాలి



డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న ఓఎస్‌డీ రమేష్, జిల్లా అధికార బృందం

పెద్దాపురం: మెట్ట ప్రాంత రైతులు బిందు, తుంపర సేద్యంపై దృష్టి సారించాలని ఏపీఎంఐపీ కమిషనరేట్ ఓఎస్‌డీ రమేష్ అన్నారు. ఆర్‌బీ పట్నంలో బిందు సేద్యాన్ని సోమవారం ఆయన ఏపీఎంఐపీ జిల్లా అధికారులు స్వాతి, రామ్మోహనరావులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా వీహెచ్‌ఏ మాదబోయిన చిలకమ్మ అధ్యక్షతన జరిగిన రైతు సదస్సులో ఓఎస్‌డీ రమేష్ మాట్లాడారు. బిందు సేద్యంలో ఎరువుల వాడకంపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. యాజమాన్య పద్ధతులు అవలంబించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. బిందు సేద్యంతో కూలీల ఖర్చును తగ్గించుకోవచ్చన్నారు. అనంతరం గ్రామంలో రైతులకు ఇచ్చిన డ్రిప్ పరికరాలను ఆయన పరిశీలించారు. డీహెచ్‌ఓ రమణ, ఎంఐఈ సత్యవేణి, జైన్, ఫైనోలెక్స్ కంపెనీ ప్రతినిధులు రమణ, జేవీఎస్ రాజు, రైతులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో నష్ట నివారణ

జెడ్పీ డిప్యూటీ సీఈఓ వేణుగోపాల్



ఆపద మిత్రలకు సర్టిఫికెట్లు అందజేసిన ప్రిన్సిపాల్ తదితరులు

సామర్లకోట: విపత్తుల సమయంలో ముందస్తు జాగ్రత్తలతో నష్టాన్ని తగ్గించవచ్చని, ఇందుకు ఆపద మిత్రలు కీలక బాధ్యత తీసుకోవాలని విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ జె.వేణుగోపాల్ అన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో బాధితులకు సహాయ కార్యక్రమాలు నిర్వహించడానికి రాష్ట్ర వ్యాప్తంగా 5,400 మంది ఆపద మిత్రలకు శిక్షణ ఇస్తున్నామని అన్నారు. కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన ఆపద మిత్రలకు స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో 12 రోజుల పాటు నిర్వహించిన శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి నుంచి వచ్చే విపత్తులను నివారించడం ఎవరికి సాధ్యం కాదన్నారు. అయితే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే కీలకమన్నారు. ప్రభుత్వం నుంచి హెచ్చరికలు వచ్చిన సమయంలో ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత ఆపద మిత్రలపై ఉందన్నారు. ఆపద మిత్రలకు ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకుని సకాలంలో స్పందించి ప్రాణనష్టం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ కమిషనర్ ఇ.కృష్ణమోహన్, విపత్తుల నివారణ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కిరణ్మయి, ఈటీసీ ఫ్యాకల్టీలు ఎంఎస్‌ఎన్ రెడ్డి, బి.ఆంజనేయులు, ఎంఎస్‌ఎన్ రెడ్డి, కేఆర్ నిహారిక, వి.ప్రసాద్, ఎస్కే మోహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు, ఉత్తమ శిక్షణ పొందిన వారికి మెమెంటోలు, ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.10 వేల విలువైన కిట్లు అందజేశారు. వీరితో పాటు ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకున్న కోనసీమ ఆపద మిత్రలకు కిట్లు సోమవారం పంపిణీ చేశారు.

గణేష్ కాలనీలో విషాదం



సామర్లకోటలో విషాదంలో బంధువులు

సామర్లకోట: స్థానిక రెండో వార్డు గణేష్ కాలనీలో సోమవారం విషాదం నెలకొంది. గణేష్ కాలనీకి చెందిన పోలిపల్లి శివకృష్ణ (25) బంధువుల ఇంటికి మోటార్ సైకిల్‌పై వెళుతున్న సమయంలో కిర్లంపూడి మండలం రాజుపాలెం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో శివకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన కుటుంబ సభ్యులు సాయంత్రం మృతదేహాన్ని ఇంటికి తీసుకురావడంతో ఆ ప్రాంతంలో విషాదం నిండింది. తల్లిదండ్రులు పోలిపల్లి సూర్యకాంతం, కృష్ణ బోరున విలపించారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి



చలో ఢిల్లీని విజయవంతం చేయాలని నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

కొత్తపల్లి: ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రం కాకినాడ నుంచి బయలుదేరిన చలో ఢిల్లీ ప్రచార జాతా సోమవారం మండలంలోని కొండెవరం చేరుకుంది. గ్రామంలో లారీ యూనియన్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ, రవాణా రంగ కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాలు పైబడిన వాహనాలను సర్వీసు నుంచి తొలగించడం దారుణమన్నారు. దీనిపై ఆధారపడిన కార్మికులు ఉపాధి లేక రోడ్డున పడే పరిస్థితి వస్తుందన్నారు. కార్యక్రమంలో మండల సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, జిల్లా రైతుసంఘం కార్యదర్శి జి.అప్పారెడ్డి, సీఐటీయూ అధ్యక్షుడు కె.నాగేశ్వరావు, పిఠాపురం లారీ యూనియన్ అధ్యక్షుడు చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

స్పందన సేవా పురస్కారం ప్రదానం



హైదరాబాద్‌లో సాయిరామకృష్ణను పురస్కారంతో సత్కరిస్తున్న సభ్యులు

సామర్లకోట: బ్రహ్మకుమారిస్ శాంతి సరోవర్ పేరున హైదరాబాద్‌లో స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణకు ఆదివారం స్పందన సేవా పురస్కారం అందించి సత్కరించారు. ఈ విషయాన్ని సోమవారం ఆయన విలేకర్లకు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ కమిషనర్ వైస్ చైర్మన్ బి.వినోద్‌కుమార్, ఫౌండేషన్ చైర్మన్ శామ్యూల్ రెడ్డి, డైరెక్టర్ అంజిరెడ్డిలు సేవా పురస్కారం అందజేశారని అన్నారు. యువత నిరాశ నిస్పృహలకు లోనుకాకుండా ఆత్మ విశ్వాసంతో మంచి పౌరులుగా ఎదగడానికి స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కృషి చేస్తుందని వినోద్‌కుమార్ తెలిపారని అన్నారు. నేను సైతం అనే సదస్సులో తమ భావాలను పంచుకునే అవకాశం రావడం అదృష్టమని సాయిరామకృష్ణ పేర్కొన్నారు. ఈ సేవా పురస్కారంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు.

స్థల పరిశీలన



తిమ్మాపురంలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

కాకినాడ రూరల్: తిమ్మాపురంలో పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిన 28 సెంట్ల స్థలాన్ని జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు సోమవారం పరిశీలించారు. అక్కడి షిరిడీ సాయిబాబా ఆలయం వెనుక ఉన్న ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాన్ని పరిశీలించి భవన నిర్మాణం గురించి పోలీస్ హౌసింగ్ బోర్డు ఏఈ షేక్ వలితో చర్చించి పలు సూచనలు చేశారు. ఎస్పీ డీఎస్పీ ఎ.అంబికాప్రసాద్, కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్, తిమ్మాపురం ఎస్సై నాగార్జున రాజు పాల్గొన్నారు.

పథకాల అమలుపై సర్వే



వేట్లపాలెంలో సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీలలిత

సామర్లకోట: మండలంలో ప్రభుత్వ పథకాల అమలుపై రెండు రోజుల పాటు సిటిజన్ ఔట్ రీచ్ సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డి.శ్రీలలిత తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా, చేయూత, ఈబీసీ నేస్తం, కాపునేస్తం, జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ సున్నా వడ్డీ వంటి పథకాలపై ప్రజల అభిప్రాయాల సేకరణ కోసం సర్వే చేస్తున్నామని అన్నారు. సోమవారం ప్రారంభమైన సర్వే మంగళవారంతో ముగుస్తుందని చెప్పారు. ఈ సర్వేలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొంటారన్నారు. అదే విధంగా ఆయుష్మాన్ భారత్ స్పెషల్ డ్రైవ్ కూడా చేస్తున్నామన్నారు. ఈ పథకంలో 31,125 మంది లబ్ధిదారులు ఉండగా ఇప్పటి వరకూ 22 వేల మందికి ఈకెవైసీని సచివాలయ సిబ్బంది పూర్తి చేశారని చెప్పారు.

ఘనంగా మధ్వనవమి వేడుకలు

బోట్‌క్లబ్(కాకినాడ): కాకినాడ మధ్వసభ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రామారావుపేటలో జగత్‌గురు మధ్వాచార్యుల బదరికాశ్రమ ప్రవేశం సందర్భంగా మధ్వనవమి వేడుకలు నిర్వహించారు. తొలుత మధ్వసభ కమిటీ అధ్యక్షులు రాచూరి రాఘవేంద్రస్వామి, కార్యదర్శి కోపెల్ల శేషగిరిరావు ఆధ్వర్యంలో మధ్వాచార్యుల విగ్రహానికి పరశురామాచార్యులు అభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి రామారావుపేట ప్రధాన రహదారుల్లో ఊరేగింపు నిర్వహించారు. స్వామి వారికి కోపెల్ల జానకి ప్రత్యేక హారతులిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.